

కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి, పక్కన బండి రమేష్

14 మంది ఎంపీలను గెలిపించుకుందాం

బాలానగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 14 మంది ఎంపీలను గెలిపించుకుని సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మరింత బలపర్చవచ్చని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కోటంరెడ్డి వినయ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం తుక్కుగూడలో నిర్వహిస్తున్న జనజాతర సభకు జనసమీకరణ నేపథ్యంలో శుక్రవారం బాలానగర్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రతీ కార్యకర్త తనతో పాటు మరో అయిదుగురు కార్యకర్తలను వెంట తీసుకుని తుక్కుగూడ బహిరంగ సభకు తరలిరావాలని సూచించారు. కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ.. తుక్కుగూడ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రియాంకగాంధీ, రాహుల్‌గాంధీ హాజరవుతున్నారని కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ స్పోక్స్ పర్సన్ సత్యం శ్రీరంగం, గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.


కాలనీలో చెత్తను శుభ్రం చేయిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

కాలనీల పరిశుభ్రత అందరి బాధ్యత

నిజాంపేట్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ 7వ డివిజన్ సర్వే నెంబరు 190లో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ కాలనీవాసులతో కలిసి శుక్రవారం పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి సమస్యలను డిప్యూటీ మేయర్ కు వివరించారు. ప్రజల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని సర్వేనెంబరు 190 కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా కాలనీలో పేరుకపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులను పిలిపించి తొలగింపజేశారు. కాలనీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ పాదయాత్రలో మున్సిపల్ సూపర్‌వైజర్ సురేష్, శ్రీఖర మాన్షన్ అపార్టుమెంట్ వాసులు, కాలనీవాసులు శివరామ్, కిష్టాఫర్, నవీన్, కేశవరావు, మహేష్ ఉన్నారు.


బీజేపీకి ఓటు వేయాలని వాకర్స్‌ను కోరుతున్న సంగీతారెడ్డి, రవికుమార్‌యాదవ్

బొటానికల్ గార్డెన్‌లో బీజేపీ ప్రచారం

గచ్చిబౌలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డిని ఎంపీగా గెలిపించాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ కోరారు. శుక్రవారం విశ్వేశ్వరరెడ్డి సతీమణి సంగీతారెడ్డితో కలిసి ఆయన వాకర్స్‌ను కలిసి బీజేపీకి ఓట్లు వేసి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. దేశం, రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని తెలిపారు.

యువతి అదృశ్యం


అంజలి

గాజులరామారం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులతో కలిసి నిద్రిస్తున్న ఓ యువతి తెల్లవారేసరికి కనిపించలేదు. గాజులరామారం ద్వారకానగర్‌కు చెందిన రావుల శోభన్ కూతురు అంజలి(20) ఇంటి వద్దే ఉంటుంది. ఈనెల 4వ తేదీ రాత్రి తమ్ముడి జన్మదిన వేడుకలు కుటుంబసభ్యులు జరుపుకొని పడుకున్నారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు తల్లి విజయలక్ష్మి లేచి చూచేసరికి అంజలి కనిపించ లేదు. దీంతో కంగారు పడిన ఆమె కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లో, చుట్టుపక్కల వెతికారు. అంజలి కనిపించకపోవడంతో సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హెచ్‌సీయూలో విద్యార్థుల ధర్నా


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ హాస్టల్‌లో ఆహార నాణ్యతను మెరుగుపరచాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు వీసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. హాస్టల్‌లో వసతులు మెరుగుపరాచాలని, సౌత్ క్యాంపస్‌లో హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, జేఆర్ఎఫ్ స్కాలర్‌లకు హెచ్ఆర్ఏ ఇవ్వాలని కోరుతూ ప్లకార్డులతో విద్యార్థులు నిరసన తెలిపారు. న్యాయమైన తమ డిమాండ్లు నెరవేర్చాలని, లేని పక్షంలో నిరసనలు కొనసాగిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గచ్చిబౌలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కొండాపూ ర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కాలనీలోని విజయగణపతి, రాజరాజేశ్వరి, శివాలయ సమేత సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జగద్గురువు శంకరాచార్య, హంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థాన పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.


ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

దీప్తిశ్రీనగర్‌లో ఇఫ్తార్

మియాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లో కాలనీలో సాజిద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటిశ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడి అప్పగింత


బంధువు తులసికి బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన బాలుడిని చిక్కడపల్లి పోలీసులు బంధువులకు అప్పగించారు. రాణీగంజ్ గాస్‌మండిలో నివసిస్తున్న శివానంద్ కుమారుడు తిలక్‌రాజ్(9)ను హాస్టల్‌లో చేర్పించేందుకు చిక్కడపల్లిలో ఉంటున్న శివానంద్ మొదటి భార్య సమత స్నేహితురాలు తులసి ఇంటికి పదిహేను రోజుల క్రితం తీసుకొచ్చాడు. ఈనెల 2వ తేదీన హాస్టల్‌లో చేర్పించడానికి అడ్మిషన్ తీసుకున్నారు. అదే రోజు తిలక్‌రాజు అదృశ్యమయ్యాడు. తులసి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం సికింద్రాబాద్ మహంకాళి దేవాలయం వద్ద తిలక్‌రాజు ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి చేరుకొని అతడిని చేరదీశారు. తులిసిని స్టేషన్‌కు పిలిపించి తిలక్‌రాజును ఆమెకు అప్పగించారు.


మూసాపేటలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, నాయకులు


రిక్షా పుల్లర్స్‌కాలనీలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


బాలానగర్‌లోని హెచ్ఏఎల్ ఎస్సీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మిక సంఘాల నాయకులు


మూసాపేటలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న జెడ్సీ అభిలాష అభినవ్, అధికారులు, సిబ్బంది

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి

(కూకట్‌పల్లి/ కుత్బుల్లాపూర్/ శేరిలింగంపల్లి జోన్‌బృందం) బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీల్లో ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు, అధికారులు ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, కేపీ వివేకానంద్, కార్పొరేటర్లు, అధికారులు నివాళులర్పించారు. పీజేఆర్‌నగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు.


129 డివిజన్ శివాలయనగర్‌లోని బాబా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్


బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ గ్రామంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి


నిజాంపేట్ కార్పొరేషన్ రాజీవ్‌గృహకల్పలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి


మియాపూర్‌లో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జగదీశ్వర్‌గౌడ్, నాయకులు, ప్రజలు


బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు


దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కమిషనర్ సత్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది.


ఓల్డుబోయినపల్లి వార్డు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో పాల్గొని జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో డివిజన్ దళిత నాయకులు


ఆల్విన్‌కాలనీ పీజేఆర్‌నగర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

● సీఎం నివాసానికి కూన శ్రీశైలంగౌడ్


కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కాంగ్రెస్‌లో చేరేందుకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సందర్భంగా ఆయన వెంట సీఎం నివాసానికి వెళ్లిన ఓల్డుబోయినపల్లి కాంగ్రెస్ నాయకులు. - ఓల్డుబోయినపల్లి, ఆంధ్రజ్యోతి

బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ కార్మికులకు అన్యాయం

● ప్రొఫెసర్ కోదండరాం

రాంనగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఆర్టీసీ కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని, ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలు జరిగాయని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఐఎన్‌టీయూసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాజిరెడ్డి ఉద్యోగ విరమణ సభ శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ముఖ్యఅతిథులుగా కోదండరాం, ఐఎన్‌టీయూజీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి. సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. రాజిరెడ్డి మూడు దశాబ్దాలకు పైగా కార్మిక నాయకుడిగా ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన ఉద్యోగ విరమణ చేసినప్పటికీ


రాజిరెడ్డి ఉద్యోగ విరమణ సభలో ప్రొఫెసర్ కోదండరాం

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ నాయకుడిగా పోరాటంచేయాలని సూచించారు. జి. సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే చర్యలు త్వరలో పూర్తవుతాయన్నారు. కె.రాజిరెడ్డి మాట్లాడుతూ.. కండక్టర్‌గా ఉద్యోగం ప్రారంభించి కార్మిక నాయకుడిగా ఎదిగానని తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, మదర్ డెయిరీ పూర్వ ఎండీ యుగేందర్‌రెడ్డి పాల్గొని రాజిరెడ్డిని సత్కరించారు.

● ఇఫ్తార్


రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీల కాలనీలో ఇఫ్తార్ విందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌గౌడ్, మైనార్టీలు - పేట్‌బషీరాబాద్

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి

పంజాగుట్ట: పంజాగుట్ట పీఎస్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సోమాజిగూడ యశోద ఆస్పత్రి సమీపంలోని ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి(50) పడివున్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్లి అతడిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు గమనించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ శోభన్ కోరారు.

భవనం 32వ అంతస్తు పైనుంచి పడి కార్మికుడి మృతి

● మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కార్మికుల ఆందోళన
● రూ.15 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించిన యాజమాన్యం

గచ్చిబౌలి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు భవనం 11వ అంతస్తు పై నుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మధ్యాహ్నం నల్లగండ్ల చౌరస్తా వద్ద చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల వివరాల ప్రకారం.. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన వెస్ట్‌బెంగాల్‌కు చెందిన కౌరుల్‌మియా(34) కుటుంబంతో వచ్చి లింగంపల్లిలో ఉన్న కాడియర్ హై రైజ్ అపార్ట్‌మెంట్ నిర్మాణ పనుల్లో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం 32వ అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ఈ క్రమంలో 12వ అంతస్తు రేయిలింగ్‌కు బలంగా తాకడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు సుమారు 300 మంది అక్కడికి చేరుకుని భవన యజమానికి వ్యతిరేక నినాదాలు చేస్తూ వీరంగం సృష్టించారు. విషయం తెలుసుకున్న యాజమాన్యం చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని కార్మికులను అదుపుచేశారు. ఒక దశలో కార్మికులకు, పోలీసులకు వాగ్వాదం జరిగింది. పోలీసులు బాధితుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని సర్దిచెప్పారు.

● రూ.15 లక్షలు ఆర్థికసాయం

మృతుడు కౌరుల్‌మియాకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. తోటి కార్మికులు విషయాన్ని యాజమాన్యం, పోలీసుల దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం కింద రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా యాజమాన్యం రూ.15 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించింది. తక్షణ సాయం కింద యాజమాన్యం రూ.లక్ష అందజేసింది. రూ.14 లక్షలు భార్య పిల్లల పేరుమీద బ్యాంకులో డిపాజిట్ చేస్తామని చెప్పారన్నారు. దీంతో మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుఉని బయలుదేరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పోలీసులతో వాగ్వాదం, ప్రమాదం జరిగిన భవనం, ఇన్‌సెట్‌లో మృతుడు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్, సభ్యులు

ఆలయ స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వీరాంజనేయస్వామి దేవాలయ స్థలం వివాదం 20 సంవత్సరాల నుంచి నడుస్తుందని, తప్పుడు డాక్యుమెంట్లను తయారు చేసి స్థలాన్ని కాజేందుకు కొంత మంది కుట్ర చేస్తున్నారని ధర్మాకర్త ట్రస్ట్ సభ్యులు ముద్దాపురం ప్రభాకర్‌గౌడ్, కృష్ణవేణి, వేణుగోపాల్, మలాతి, మాధవిలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు కలిసి జయరామ్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయంలో విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. ఈ స్థలం విషయంలో 2014లో హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ ఆలయం వెనుకాల స్థలంలో ప్రహరీ నిర్మాణం చేశారన్నారు. ఆ స్థలానికి కొంత మంది బై నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. హెచ్ నరేందర్, డి.రవీందర్ ఫోర్జరీ చేసి 2వ డాక్యుమెంట్ తయారు చేసుకొని పలువురు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశార న్నారు. నల్లా జయశంకర్‌గౌడ్ 177 గజాలు, కె.సంజీవరావు 725 గజాలు 2018లో మళ్లీ రిజిస్టేషన్ చేసుకొని, గొడవలకు దిగుతున్నారని వాపోయారు. ఇలాంటి వారిపై పూర్తి విచారణ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నీతూబాయి అరెస్టు

గంజాయి సరఫరా చేస్తూ పోలీసులకు చిక్కిన నిందితురాలు


పోలీసుల అదుపులో నీతూబాయి

వర్గల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా నిందితురాలు నీతూబాయిని శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గౌరారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. సంఘటనకు సంబంధించి గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలో నివాసముంటున్న గంజాయి సరఫరా చేసే నిందితురాలు నీతూబాయిని ప్రశ్నించారు. ఎక్కడి నుంచి గంజాయి తీసుకువచ్చేది, ఎవరెవరికీ అమ్మేవారు, ఎవరెవరితో డిజిటల్ లావాదేవీలు జరిపారని ఆరా తీశారు. పదేళ్ల నుంచి గంజాయిని విక్రయిస్తున్నదని, ఇటీవల తనతో పాటు తన కుటుంబసభ్యులను శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు, గోల్కొండ, గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారని, తనతో పాటు తన కుటుంబసభ్యులపై 18 కేసులు నమోదు చేసినట్లు నీతూబాయి తెలిపింది. నీతూబాయిపై హైదరాబాద్ పోలీసులు పీడీయాక్ట్ నమోదు చేసి సుమారు సంవత్సరం పాటు జైలులో ఉంచారు. తన అస్తులను అటాచ్ చేసినా తన గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వర్గల్ మండలంలోని పలు గ్రామాల్లో గంజాయికి అలవాటు పడిన యువకులను విచారిస్తామని సీఐ తెలిపారు. గంజాయి తాగిన వారిని జైలుకు పంపిస్తామని సీఐ హెచ్చరించారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్

బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్


సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పదేళ్లు పాలించిన బీఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసం చేశాయని బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆరోపించారు. కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను అర్హులకు అందించడంలో విఫలమవుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాలంటే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరముందన్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించే అవకాశం బీజేపీ అభ్యర్థిగా తనకు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రరావు, మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయినేని సూర్యప్రకాష్‌రావు, మహేందర్, శ్రీకర్‌రావు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటు వేసి దేశాభివృద్ధికి సహకరించండి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేసే అసత్య ప్రచారాలకు, హామీలకు మోసపోకుండా దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్న బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లోని మోదీ అపార్టుమెంటువాసులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. దేశ రక్షణ, అభివృద్ధి కోసం పాటు పడుతున్న బీజేపీకి మద్దతు తెలిపి ప్రధాని నరేంద్రమోదీని మూడోసారి ప్రధాని చేసేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో మల్లారెడ్డి, భరత్ సింహారెడ్డి, అపార్ట్‌మెంటు వాసులు, మహిళలు పాల్గొన్నారు.